శ్రీరామ సప్తాహ మహోత్సవాలు ప్రారంభం


కొలువుదీరిన దాసాంజనేయస్వామి

జియాగూడ: జియాగూడలోని శ్రీ సద్గురు సమర్థ నారాయణ ఆశ్రమంలో శ్రీరామ సప్తాహ మహోత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. నేటి నుంచి ఈ నెల 23వ తేదీ వరకు ప్రతిరోజూ ఆశ్రమంలో వివిధ దేవతామూర్తులకు ప్రత్యేక పూజలు, అలంకరణ, అఖండ హారతి, అన్నదాన కార్యక్రమాలు కొనసాగుతాయని ఆశ్రమం 12వ మఠాధిపతి ప్రభుదత్త మహారాజ్ తెలిపారు. గురువారం మహారాజుల వారి ఆలయంలో శ్రీవారికి గురుపూజ, శ్రీ సమర్థ భక్తుల ద్వారా ఉపాసన సేవా, శ్రీ సహస్ర మోదక గణపతి హోమం, శ్రీ ఆదిత్యాది నవగ్రహ దేవత హోమం, పూర్ణాహుతి, శ్రీరామ తారక హోమం, మహా మంగళ హారతి, అన్నదాన కార్యక్రమం జరిగింది. 19న శ్రీ కామధేను మాతకు మహాపూజ, భక్తుల ద్వారా గోపూజ, గోగ్రాస సేవా, శ్రీ సూక్త పూర్వక లక్ష్మీనారాయణ హోమం, శ్రీరామ తారక హోమం, 20న శ్రీ ప్రతాప మారుతి, శ్రీ దాస మారుతిలకు మహాపూజ, ఆకుపూజ సేవా, వడమాల సేవా, 21న శ్రీ హరిహరేశ్వర, 12 సర్వేశ్వరులకు మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, రుద్రహోమం, పూర్ణాహుతి ఉంటాయి. 22న శ్రీ గజలక్ష్మీమాతకు మహాపూజ, అమ్మవారి వాయినం, నవచండిక హోమం, కొమారిక పూజ, పూర్ణాహుతి తదితరవి ఉంటాయి. చివరి 23న శ్రీ కల్పవృక్ష మారుతి, అమరేశ్వర స్వామికి కుంబాభిషేకం, మహాపూజ, ఊయల సేవ, హనుమాన్ జయంతి, శ్రీ సీతారామ స్వామి రథోత్సవం, మంగళహారతి, మహాఅన్నదాన కార్యక్రమంతో వేడుకలు ముగుస్తాయన్నారు.

పీఆర్సీ కమిషనర్‌ను కలిసిన పెన్షనర్ల సంఘం


పీఆర్సీ కమిషనర్‌తో చర్చిస్తున్న పెన్షనర్ల సంఘం నేతలు నర్సయ్య, నవనీతరావు

నాంపల్లి: తెలంగాణ పెన్షనర్ల కేంద్ర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గాజుల నర్సయ్య నేతృత్వంలో ఒక ప్రతినిధి బృందం గురువారం వేతన సవరణ కమిటీ కమిషనర్‌ను కలిసింది. పెన్షనర్లు, కుటుంబ పెన్షనర్లకు సంబంధించిన పలు అంశాలపై కమిషనర్‌తో చర్చించి నివేదికను సమర్పించారు. అడిషనల్ క్వాంటమ్ ఆఫ్ పెన్షన్‌ను 65 ఏళ్ల వారికి 15 శాతం అదనంగా చెల్లించాలని, ఈ పెన్షన్ ప్రతి నెలా ఒకటవ తేదీనే చెల్లించాలని కోరారు. రెస్టోరేషన్ ఆఫ్ కమిటెడ్ పెన్షన్ 15 సంవత్సరాల నుంచి 10 సంవత్సరాలకు కుదించాలని, వైద్య అలవెన్సులు నెలకు రూ.2వేలు చెల్లించాలని, మొదటి పే కమిషనర్ సూచించిన ప్రకారం ఒక శాతం కాంట్రిబ్యూషన్‌తో నాణ్యమైన చికిత్సను అన్ని రకాల రోగాలకు పరిమితి లేకుండా అమలు చేసేలా ఆదేశాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి ఇ.నవనీతరావు, వర్కింగ్ ప్రెసిడెంట్ టి.ప్రేమ్‌కుమార్, గ్రేటర్ హైదరాబాదు అధ్యక్షులు హెచ్.రాములు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణలో బీజేపీ హవా


ఈటల రాజేందర్‌ను కలిసిన నాయకులు

గోల్కొండ: తెలంగాణలో అత్యధిక ఎంపీ స్థానాలు గెలిచి బీజేపీ సత్తాచాటుతుందని ఆ పార్టీ మల్కాజిగిరి అభ్యర్థి ఈటల రాజేందర్ అన్నారు. బీజేపీ సీనియర్ నాయకుడు దేవర శ్రీనివాస్ ఆధ్వర్యంలో పలువురు బీజేపీ నాయకులు, రాష్ట్ర కురుమ సంఘం నాయకులు గురువారం ఆయనను కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా ఈటల రాజేందర్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ లాగే కాంగ్రెస్ కూడా అబద్ధపు ప్రకటనలు ఇస్తూ ప్రజలను మభ్యపెడుతుందన్నారు. అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లోనే తెలంగాణ ప్రజలు కాంగ్రెస్ నైజాన్ని గ్రహించారన్నారు. ప్రధాని నరేంద్రమోదీపై ప్రజల ఆదరణ రోజురోజుకూ పెరుగుతుందని తెలంగాణలో ఇది స్పష్టంగా కానవస్తుందన్నారు. ఆయనను కలిసిన వారిలో దేవర శ్రీనివాస్, ప్రభు ప్రజారి, కురుమ సంఘం రాష్ట్ర నాయకుడు దొడ్డి శ్రీనాథ్ తదితరులున్నారు.

అసదుద్దీన్ ఒవైసీని గెలిపించాలి

యాకుత్‌పురా: సార్వత్రిక ఎన్నికలను పురస్కరించుకొని మజ్లిస్ హైదరాబాద్ ఎంపీ అభ్యర్థి అసదుద్దీన్ ఒవైసీకి మద్దతుగా పార్టీ యాకుత్‌పురా ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్ గురువారం పలు ప్రాంతాల్లో నాయకులు, కార్యకర్తలతో కలిసి ప్రచారం నిర్వహించారు. తమ పార్టీ అధినేత ఎంపీ అసదుద్దీన్‌కు ఈ ఎన్నికల్లో ఓటువేసి ప్రజలు తిరిగి గెలిపించాలని ఇంటింటికీ తిరుగుతూ ఓట్లు అభ్యర్థించారు. ఆయనతో పాటు కార్పొరేటర్లు డాక్టర్ సమీనాబేగం, నస్రీన్ సుల్తానా, వసీవుద్దీన్, యాకుత్‌పురా ఇన్‌చార్జి యాసర్ అరాఫత్ తదితరులు పాల్గొన్నారు.


ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్

మజ్లిస్ దమ్మున్న పార్టీ: అసదుద్దీన్ ఒవైసీ


గోల్కొండలో పాదయాత్ర చేస్తున్న ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ

గోల్కొండ: మజ్లిస్ దమ్మున్న పార్టీ అని అందువల్లే ఇతర రాష్ట్రాల్లో కూడా మజ్లిస్ తమ అభ్యర్థులను పోటీలో నిలబెడుతుందని ఆ పార్టీ అధ్యక్షుడు హైదరాబాద్ సిట్టింగ్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ అన్నారు. గురువారం ఆయన టోలిచౌకీ డివిజన్‌లోని బంజారి దర్వాజ, రిసాలాబజార్, దేవ్‌దాస్‌పురా, కటోరా హౌజ్ తదితర ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తూ పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా ఆయన స్థానికులను కలిసి మజ్లిస్ పార్టీకి ఓటు వేసి తనను గెలిపించాలని కోరారు. అరెస్టులకు, అక్రమ కేసులకు భయపడి వెనుకడుగు వేయబోమని ఆయన స్పష్టం చేశారు. ఉత్తర దక్షిణ రాష్ట్రాలలో పీడిత, బాధిత ప్రజలకు అండగా ఉంటూ వస్తున్న ఏకైక పార్టీ మజ్లిస్ అని అన్నారు. నేడు ఎన్‌కౌంటర్ల పేరిట ఎందరో అమాయకులను పొట్టనబెట్టుకుంటున్నారని ఆయన ఆరోపించారు. ఆయన వెంట ఎమ్మెల్యే కౌసర్‌మోహియుద్దీన్, టోలిచౌకీ డివిజన్ మజ్లిస్ నాయకులు హరూన్‌ఫరాన్, అజీజ్‌ఖాన్ పటాన్, మహ్మద్ నజీబ్ తదితరులున్నారు.

శాంతియుత వాతావరణానికి బీజేపీ, ఆర్ఎస్ఎస్‌లతో ప్రమాదం..

సాక్షి,సిటీబ్యూరో: హైదరాబాద్‌లోని శాంతియుత వాతావరణానికి బీజేపీ, ఆర్ఎస్ఎస్‌లతో ప్రమాదం పొంచి ఉందని ఏఐఎంఐఎం అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ ఆందోళన వ్యక్తం చేశారు. గురువారం హైదరాబాద్‌లో విలేకర్లతో మాట్లాడుతూ.. శ్రీరామ నవమి ర్యాలీ సందర్భంగా బీజేపీ అభ్యర్థి మతపరమైన కట్టడం ముందు వ్యవహరించిన తీరును ఆయన తీవ్రంగా ఖండించారు. ఎన్నికల రాజకీయ లబ్ధి కోసం ఒక వర్గాన్ని టార్గెట్ కాదు..దుర్భాషలాడటమేమిటని ప్రశ్నించారు. ఒక వర్గంపై చేసిన అభ్యంతర వాఖ్యలపై ఎన్నికల సంఘం, డీఈఓ, సీఈఓ, హైదరాబాద్ పోలీస్ కమిషనర్ మౌనం వహించడమేమిటన్నారు.

ఆర్థిక లావాదేవీల విషయంలో వ్యక్తిపై కత్తితో దాడి

సంతోష్‌నగర్: ఆర్థిక లావాదేవీల విషయంలో ఓ వ్యక్తిపై కత్తితో దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన ఘటన గురువారం ఐ.ఎస్.సదన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం ..బడంగ్‌పేట్‌కు చెందిన సాయికుమార్ (26) కార్ల క్రయ విక్రయాల వ్యాపారం చేస్తుంటాడు. సాయి కుమార్ 2022లో తన సోదరి వివాహం కోసం పెద్దనాన్న వెంకటేశ్ కుమారుడైన సంతోష్‌నగర్ కానిస్టేబుల్ మహేశ్ కుమార్ వద్ద రూ.2 లక్షలను 4 శాతం వడ్డీకి తీసుకున్నాడు. అప్పటి నుంచి సాయికుమార్ తీసుకున్న డబ్బులకు వడ్డీ చెల్లిస్తూ ఉన్నాడు. మహేశ్ కుమార్ అసలు డబ్బులు ఇవ్వాలని గత కొన్ని రోజులుగా ఒత్తిడి తేస్తున్నాడు. ఇందులో భాగంగా గురువారం డబ్బుల విషయం మాట్లాకుందామని సాయి కుమార్ కారులో మహేశ్ కుమార్ చంద్రయ్య హట్స్‌లోని తన నివాసం వద్ద చేరుకున్నారు. దీంతో డబ్బులు విషయమై మాట్లాడుతుండగా చిన్నపాటి గొడవ జరిగి మాటామాట పెరగడంతో మహేశ్‌కుమార్‌తో పాటు తండ్రి శ్రీశైలం, సోదరుడు జగదీష్‌తో సాయి కుమార్‌పై కత్తితో దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. సాయి కుమార్‌ను చికిత్స నిమిత్తం ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. బాధితుని తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

హత్య కేసులో నిందితుల అరెస్ట్

చాంద్రాయణగుట్ట: యువకుడి హత్య కేసులో ఐదుగురు నిందితులను బహదూర్‌పురా పోలీసులు అరెస్ట్ చేసి గురువారం రిమాండ్‌కు తరలించారు. దక్షిణ మండలం డీసీపీ సాయి చైతన్య తెలిపిన వివరాల ప్రకారం.. కిషన్‌బాగ్ అసద్‌బాబానగర్‌కు చెందిన మహ్మద్ ఖలీల్(23) అదే బస్తీకి చెందిన కిషన్‌బాగ్ అసద్‌బాబానగర్‌కు చెందిన షేక్ షహబాజ్(22), షేక్ షానవాజ్(23), షోయబ్‌ఖాన్(30), మహ్మద్ ఫారూఖ్(20), సయ్యద్ అక్బర్(29), జువైనల్ బాయి అందరూ స్నేహితులు. ఈనెల 15న మద్యం సేవించిన సమయంలో ఖలీల్, మైనర్ బాలుడిపై దాడి చేశాడు. ఇది గమనించిన షహబాజ్ ఖలీల్‌తో గొడవపడి ఒకరినొకరు కొట్టుకున్నారు. స్థానికులు కల్పించుకొని అందరిని విడగొట్టారు. ఈ ఘటనను సీరియస్‌గా తీసుకున్న షహబాజ్ తన మిత్రులతో కలిసి కొద్ది దూరంలోనే ఉన్న ఖలీల్‌పై కత్తితో హత్య చేసి పరారయ్యారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టి నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

వారసత్వ సంపదను భావితరాలకు అందించాలి

జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్‌రాస్


మాట్లాడుతున్న కమిషనర్ రోనాల్డ్ రాస్

అఫ్జల్‌గంజ్: వారసత్వ సంపదను భావితరాలకు అందించాల్సిన బాధ్యత మన అందరిపై ఉందని జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్‌రాస్ అన్నారు. గురువారం అంతర్జాతీయ హెరిటేజ్ దినోత్సవాన్ని పురస్కరించుకుని జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో పాతబస్తీలోని దారుల్‌షిఫా వద్ద నుంచి హెరిటేజ్ వాక్ ప్రారంభించారు. సాలార్‌జంగ్ మ్యూజియం, నయాపూల్ ప్రాంతాల మీదుగా కొనసాగి ఉస్మానియా ఆసుపత్రి ప్రాంగణంలోని చారిత్రాత్మక చింతచెట్టు వద్ద ముగిసింది. ఈ హెరిటేజ్ వాక్‌లో జీహెచ్ఎంసీ కమిషనర్‌తో పాటు జోనల్ కమిషనర్లు, హెచ్ఓడీలు, హెరిటేజ్ ప్రియులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ..నగరంలో ప్రాముఖ్యత గల వారసత్వ సంపదను కాపాడుకునేందుకు విశేష కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే చార్మినార్ పాదచారుల ప్రాజెక్టును అభివృద్ధి చేసినట్లు గుర్తు చేశారు. జీహెచ్ఎంసీలో మూడు పురాతన భవనాల పునర్‌నిర్మాణం సుందరీకరణ కోసం రూ.18.33 కోట్ల వ్యయంతో మోజంజాహీ మార్కెట్, మౌలాలి కమాన్, హుస్సేని ఆలం తదితర ఆరు కమాన్‌లు అభివృద్ధి చేయనున్నట్లు ఆయన తెలిపారు. 1908లో జరిగిన మూసీ వరదల తర్వాత నగరంలో చేపట్టిన అభివృద్ధి పనులను స్ఫూర్తిగా తీసుకుని ఈ హెరిటేజ్ వాక్‌ను నిర్వహించినట్లు తెలిపారు.

నాంపల్లి పబ్లిక్ గార్డెన్స్‌లో..

నాంపల్లి: చారిత్రక వారసత్వ సంపదను పరిరక్షించుకోవాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉందని పర్యాటక, సాంస్కృతిక శాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్ అన్నారు. గురువారం నాంపల్లి పబ్లిక్ గార్డెన్స్‌లోని పురావస్తు శాఖ, ప్రదర్శన శాల ఆడిటోరియంలో ప్రపంచ హెరిటేజ్ డే వేడుకలు జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆమె సదస్సును ప్రారంభించి ప్రసంగించారు. వారసత్వ కట్టడాల పరిరక్షణకు పాటుపడుతున్న 24 మందికి అవార్డులను అందజేశారు. ఈ కార్యక్రమంలో పురావస్తు శాఖ సంచాలకులు భారతి హోలికేరి, డిప్యూటీ సెక్రెటరీ బాల్జీరావు, ఇన్‌టాక్ కన్వీనర్ అనురాధ, సయ్యద్ సజ్జాద్ తదితరులు పాల్గొన్నారు.


ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న దక్కన్ హెరిటేజ్ అకాడమీ ట్రస్ట్ చైర్మన్ వేదకుమార్

వారసత్వ సంపదను కాపాడుదాం..

బహదూర్‌పురా: హెరిటేజ్‌ను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వక్తలు ఉద్ఘాటించారు. సౌత్‌జోన్ ఇంటర్నేషనల్ కౌన్సిల్ ఆన్ మాన్‌మెంట్స్ అండ్ సైట్స్, దెక్కన్ హెరిటేజ్ అకాడమీ ట్రస్ట్, సాలర్‌జంగ్ మ్యూజియం, ఓక్స్‌సేన్ స్కూల్ ఆఫ్ ఆర్కిటెక్చర్ అండ్ ప్లానింగ్ సంయుక్త ఆధ్వర్యంలో ప్రపంచ వారసత్వ దినోత్సవాన్ని గురువారం సాలర్‌జంగ్ మ్యూజియంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దక్కన్ హెరిటేజ్ అకాడమీ ట్రస్ట్ చైర్మన్ ఎం.వేదకుమార్, హైకమోజ్ ఇండియా సౌత్‌జోన్ ప్రతినిధి సూర్యనారాయణ మూర్తి, శివ, సాలర్‌జంగ్ మ్యూజియం జాయింట్ డైరెక్టర్ నాగేశ్వర్‌రావు, టీఎస్ఏపీ అధ్యక్షుడు పార్థసారథి తదితరులు పాల్గొన్నారు.

నేడు మజ్లిస్ అభ్యర్థి అసదుద్దీన్ ఒవైసీ నామినేషన్

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ స్థానానికి మజ్లిస్ అభ్యర్థి అసదుద్దీన్ ఒవైసీ శుక్రవారం నామినేషన్ దాఖలు చేయనున్నారు. పాతబస్తీలోని మక్కా మసీదులో నమాజ్ ఏ జుమా (శుక్రవారం ప్రత్యేక ప్రార్థన)లు నిర్వహించి మధ్యాహ్నం 2 గంటలకు లక్డీకాపూల్‌లో హైదరాబాద్ కలెక్టర్ కార్యాలయానికి చేరుకుంటారు. అక్కడ ఎన్నికల రిటర్నింగ్ అధికారికి తమ నామినేషన్ పత్రాలు సమర్పించనున్నారు.

25 నుంచి వేసవి శిక్షణా శిబిరం ప్రారంభం

నాంపల్లి: జవహర్ బాలభవన్‌లో వేసవి శిక్షణా తరగతులు ఈనెల 25వ తేదీ నుంచి ప్రారంభమవుతాయని డైరెక్టర్ విజయలక్ష్మి ఓ ప్రకటనలో తెలిపారు. బాలబాలికల్లోని ప్రతిభాపాటవాలను వెలికి తీయడానికి ప్రతి ఏటా శిక్షణా తరగతులను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భరతనాట్యం, చిత్రలేఖనం, క్రాఫ్ట్స్, జానపదం, సంగీతం, స్కేటింగ్, సాహిత్యం, లైబ్రరీ తదతర అంశాల్లో శిక్షణ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఆసక్తి కలిగిన బాలబాలికలు వేసవి శిక్షణా తరగతులను సద్వినియోగం చేసుకోవచ్చని సూచించారు. శిక్షణను పూర్తి చేసుకున్న బాలబాలికలకు ప్రశంసా పత్రాలు అందజేయడం జరుగుతుందని వివరించారు. మరిన్ని వివరాలకు నాంపల్లి పబ్లిక్ గార్డెన్స్‌లోని జవహర్ బాలభవన్‌ను సంప్రదించాలని తెలియజేశారు.

అభినందనలు


ప్రశంసాపత్రాలతో విద్యార్థులు

గోల్కొండ: ఐఎన్‌టీఎస్ఓ ఒలింపియాడ్‌లో మెహిదీపట్నం శ్రీ చైతన్య విద్యార్థులు సత్తాచాటారు. ఈ సందర్భంగా మంగళవారం మెహిదీపట్నంలోని పాఠశాలలో విద్యార్థులకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ చైతన్య పాఠశాలల ఏజీఎం జి.కృష్ణ విద్యార్థులను అభినందించారు. 49 మంది విద్యార్థులకు గోల్డ్ మెడల్స్, 53 మంది విద్యార్థులకు కన్సోలేషన్ బహుమతులు, 262 మందికి మెరిట్ సర్టిఫికెట్లు వచ్చాయని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ స్వాతి, ఆర్ఐ హరికృష్ణ, కోఆర్డినేటర్ రవికుమార్, ప్రవీణ్, డీన్ ఓంకార్, నదీమ్, ఆంజనేయులు తదితరులున్నారు.

మత్తులో రోడ్లపై తిరుగుతున్న యువకులకు జైలు

గోల్కొండ: మత్తులో రోడ్లపై తిరుగుతూ హంగామా చేస్తున్న ఐదుగురు యువకులకు జైలు శిక్ష పడింది. గోల్కొండ ఇన్‌స్పెక్టర్ సైదులు తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం ఉదయం ఎండిలైన్స్‌లో పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీసులకు ఐదుగురు యువకులు అనుమానాస్పదంగా తిరుగుతున్నారు. పోలీసులు వారిని అదుపులోకి తీసుకొని విచారించారు. అయితే వారు మత్తులో ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. ప్రతినిత్యం మద్యం మత్తులో రోడ్లపై తిరుగుతూ స్థానికులకు ఇబ్బందులు కలగచేస్తున్నారని పోలీసులకు తెలిసింది. దీంతో వారిని గురువారం న్యాయస్థానంలో హాజరుపరిచారు. న్యాయమూర్తి మహ్మద్ అసర్(26), షేక్ అజ్మత్(26), మహ్మద్ హాజీ(24), సయ్యద్ రిజ్వాన్(21), ఎస్.కె. సలీం(30)కు మూడు రోజుల జైలు శిక్ష, ఒకొక్కరికి రూ.50 వేల జరిమానా విధించారు.

బంగారు గొలుసులు, సెల్‌ఫోన్లు పోగొట్టుకున్న భక్తులు

రెండ్రోజులుగా అందుతున్న ఫిర్యాదులు

అబిడ్స్: శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు పోగొట్టుకున్న బంగారు గొలుసులు, సెల్‌ఫోన్లకు సంబంధించి మంగళ్‌హాట్ ఠాణాలో గురువారం కూడా ఫిర్యాదులు అందాయి. శ్రీరామ నవమి సందర్భంగా బుధవారం శోభాయాత్రలో భక్తజనుల సందడి ఎక్కువగా ఉండటంతో కొంత మంది దొంగలు విలువైన బంగారు గొలుసులు, సెల్‌ఫోన్లను తస్కరించడం చర్చానీయాంశమైంది. బుధవారం రాత్రి కొంత మంది తమ గొలుసులు చోరీకి గురైనట్లు ఫిర్యాదు చేయగా గురువారం కూడా పలువురు బాధితులు ఫిర్యాదు చేశారు. మంగళ్‌హాట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో 5 బంగారు గొలుసులు, షాయినాయత్‌గంజ్ ఠాణా పరిధిలో రెండు బంగారు గొలుసులు పోయినట్లు ఫిర్యాదులు అందాయి.

'పండుగలు మత సామరస్యాన్ని పెంచుతాయి'


సీపీ శ్రీనివాస్‌రెడ్డిని అభినందిస్తున్న మహ్మద్ ఇస్మాయిల్ అన్సారీ

నాంపల్లి: పండుగలు మత సామరస్యాన్ని పెంపొందింపజేస్తాయని నగర పోలీసు కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి అన్నారు. అమన్ కమిటీ అధ్యక్షుడు మహ్మద్ ఇస్మాయిల్ అన్సారీ అలియాస్ ఉర్దూ అన్సారీ ఆధ్వర్యంలో ఈద్ మిలాప్‌ను పురస్కరించుకుని పలువురు ముస్లిం మైనార్టీలు నగర పోలీసు కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డికి మిఠాయిలు పంచిపెట్టారు. ఈ సందర్భంగా పోలీసు కమిషనర్‌ను సత్కరించి అభినందనలు తెలిపారు. మహ్మద్ ఇస్మాయిల్ అన్సారీ మాట్లాడుతూ..రంజాన్, శ్రీరామ నవమి పండుగలు ప్రశాంతంగా జరిగాయని, శాంతియుతంగా నిర్వహించిన పోలీసు శాఖకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అర్షియా నాయిడ్, ఖైసర్ అన్సారీ తదితరులు పాల్గొన్నారు.

హజ్ యాత్రికుల దుస్తుల కోసం ప్రత్యేక ఎగ్జిబిషన్


హజ్ యాత్ర కోసం ప్రత్యేకంగా రూపొందించిన ఎహ్రారం దుస్తుల ప్రదర్శన


ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న ముస్లింలు

చార్మినార్: హైదరాబాద్ నుంచి హజ్ యాత్రకు వెళ్లే ముస్లింల సౌకర్యార్థం పాతబస్తీ మదీనా సర్కిల్‌లోని మహ్మద్ క్యాప్ మార్ట్‌లో ప్రత్యేక దుస్తుల ఎగ్జిబిషన్ గురువారం ప్రారంభమైంది. మే, జూన్‌లలో హజ్ యాత్ర నిర్వహించే ముస్లింలు ఎండల నుంచి ఉపశమనం పొందడమే కాకుండా జోరుగా కురిసే వానల నుంచి తమను తాము కాపాడుకోవడానికి ప్రత్యేకంగా తయారు చేయించిన ఎహ్రారం దుస్తులు ప్రత్యేక రక్షణ కల్పిస్తాయి. ఇందుకోసం తమ షో రూంలో రెండు నెలల పాటు ప్రత్యేక ఎగ్జిబిషన్ కమ్ సేల్స్ ఏర్పాటు చేసినట్లు మహ్మద్ క్యాప్ మార్ట్ మేనేజింగ్ డైరెక్టర్ మహ్మద్ ఇలియాస్ బుకారీ తెలిపారు. మే, జూన్ మాసాల్లో హజ్ యాత్ర జోరుగా కొనసాగుతుందని..అక్కడి వాతావరణాన్ని తట్టుకునే విధంగా ఎహ్రారం దుస్తులను రూపొందించి అందుబాటు ధరల్లో ఉంచినట్లు ఆయన తెలిపారు. ఎహ్రారం బెల్ట్, పాకెట్ ప్రార్థన చాప, స్లీపర్ బ్యాగులు, షోల్డర్ బ్యాగులు, గొడుగు, క్యాప్స్, ప్రార్థన పూసలు, లెదర్ సాక్స్, కాటన్ ప్రింటెడ్ స్కార్ఫ్, మిస్వాక్..ఇలా దాదాపు 26 వస్తువులతో కూడిన ప్యాకేజీ అందుబాటులో ఉందన్నారు.

ఉత్సాహంగా గ్రాడ్యుయేషన్ డే

గోల్కొండ: విద్యార్థుల జీవితంలో ప్రీప్రైమరీ తరగతులు ఎంతో విలువైనవని నాగార్జున విద్యా సంస్థల కరస్పాండెంట్ భరత్‌కుమార్ అన్నారు. షేక్‌పేట్‌లోని నాగార్జున హైస్కూల్‌లో యూకేజీ పూర్తి చేసిన వారి కోసం గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఎంతో హుందాగా గ్రాడ్యుయేషన్ గౌన్, ప్యాప్‌లలో తమ పట్టాలను అందుకున్నారు. ప్రిన్సిపాల్ భగవతి, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే రాజాసింగ్‌పై కేసు నమోదు

అబిడ్స్: గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్‌పై అఫ్జల్‌గంజ్ పోలీసులు కేసు నమోదు చేశారు. బుధవారం రాత్రి రాజాసింగ్ నిర్వహించిన శోభాయాత్రలో పోలీసుల నిబంధనలు పాటించలేదని, రాత్రి 10 గంటల తర్వాత శోభాయాత్ర నిర్వహించారని బాణాసంచా కాల్చారని ట్రాఫిక్‌కు అంతరాయం కల్గించినందుకు కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ లింగేశ్వర్‌రావు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో శ్రీరామ శోభాయాత్ర


తాడెం శ్రీనివాసారావును సన్మానిస్తున్న మహిళలు


శోభాయాత్రలో పెద్ద ఎత్తున పాల్గొన్న యువకులు

చాంద్రాయణగుట్ట: ఉప్పుగూడ పరిసరాలు బుధవారం రాత్రి జై శ్రీరామ్ నినాదాలతో మారుమోగాయి. శ్రీరామ నవమి సందర్భంగా శ్రీరామ సేన నిర్వాహకులు తాడెం శ్రీనివాసారావు ఆధ్వర్యంలో నిర్వహించిన శోభాయాత్ర భక్తిశ్రద్ధలతో కొనసాగింది. ఉప్పుగూడ, అరుంధతి కాలనీ, రక్షాపురం, శంకర్‌బాగ్, సాయిబాబానగర్, శివాజీనగర్‌ల మీదుగా కొనసాగిన ఈ శోభాయాత్రలో మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. శోభాయాత్రలో హనుమాన్ వేషధారణ వేసిన కళాకారులు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నారు. అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా పోలీసులు గట్టి బందోబస్తును ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ఆలే జితేంద్ర, నాయకులు ఆలే భాస్కర్ రాజ్, పెండెం లక్ష్మణ్, గంజి వేణు, శ్రీనివాసాచారి, మాణిక్ ప్రభు, జయ, రుక్మిణి, దశరథ్ లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

శోభాయమానంగా సీతారాముల ఊరేగింపు


స్వాగత వేదికపై రాహుల్ దాస్ బాబా

లంగర్‌హౌస్: కల్యాణ సీతారాముల ఊరేగింపు శోభాయమానంగా జరిగింది. లంగర్‌హౌస్ త్రివేణి సంగం మీసాల రాముడు, జానకీ దేవిల ఊరేగింపు గురువారం అర్ధరాత్రి వరకు వైభవంగా జరిగింది. పీఠాధిపతి 1008 రాహుల్ దాస్ బాబా ఆధ్వర్యంలో వేద పండితులు రాజనర్సిహ్మాచారి సమక్షంలో లంగర్‌హౌస్ వీధుల్లో కల్యాణ సీతారాములను ఊరేగించారు. రామాయనాన్ని క్లుప్తంగా తెలిపేలా 70 విగ్రహాల ఊరేగింపు ప్రధాన ఆకర్షనగా నిలిచాయి. దారి పొడువున వేదికలు వేసి శోభాయాత్రకు స్వాగతం పలికారు. ఈ ఊరేగింపులో ప్రముఖ సంఘ సేవకులు రాజు వస్తాద్, నాయకులు, భక్తులు వెంకట క్రిష్ణ, చంటిబాబు, రఘు పాల్‌రెడ్డి, లింగారెడ్డి, వినేష్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు


పూజలు నిర్వహిస్తున్న నాగ్‌నాథ్ మాశెట్టి

చార్మినార్: వసంత నవమి ఉత్సవాల్లో భాగంగా గురువారం తెల్లవారు జామున చార్మినార్ భాగ్యలక్ష్మి ఆలయంలో టీఎస్ బస నవ కేంద్రం అధ్యక్షుడు నాగ్‌నాథ్ మాశెట్టి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ట్రస్టీ శశికళ ఆలయ మర్యాదలతో ఆయనకు ఘనంగా స్వాగతం పలికి శాలువాతో సత్కరించి అమ్మవారి ప్రసాదాన్ని అందజేశారు. గత రెండు రోజులగా భక్తిశ్రద్ధలతో జరిగిన పూజా కార్యక్రమాలు గురువారంతో ముగిశాయి. ఈ సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు.

యువత స్వయం ఉపాధి ద్వారా ఇతరులకు స్ఫూర్తిగా నిలవాలి


స్టూడియోను ప్రారంభిస్తున్న వకుళాభరణం కృష్ణమోహన్‌రావు

సుల్తాన్‌బజార్: యువత స్వయం ఉపాధి ద్వారా ఇతరులకు స్ఫూర్తిగా నిలవాలని బీసీ కమిషన్ చైర్మన్ డాక్టర్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు అన్నారు. గురువారం జాంబాగ్‌లోని మహాదేవ లైటింగ్ స్టూడియోను వకుళాభరణం కృష్ణమోహన్‌రావు ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీసీ యువత తమకున్న నైపుణ్యంతో స్వయం ఉపాధి పొందుతూ ఇతరులకు ఉపాధిని ఇవ్వాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో నరేష్, కరుణాని, అభిషేక్, సురేష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అశోక్‌గౌడ్‌కు సన్మానం



అబిడ్స్: తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ లీగల్, హ్యూమన్ రైట్స్, ఆర్‌టీఐ డిపార్ట్‌మెంట్ నూతన చైర్మన్‌గా నియమితులైన పొన్నం అశోక్‌గౌడ్‌ను ప్రముఖ న్యాయవాది, వైస్ చైర్మన్ సత్తి ప్రకాశ్‌రెడ్డి ఘనంగా సత్కరించారు. గురువారం పదవీ బాధ్యతలు చేపట్టిన పొన్నం అశోక్‌గౌడ్‌ను సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా సత్తి ప్రకాశ్‌రెడ్డి మాట్లాడుతూ..ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమం, అభివృద్ధి, ప్రగతితోనే హైదరాబాద్, సికింద్రాబాద్‌లతో పాటు అత్యధిక పార్లమెంటు స్థానాల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధిస్తుందన్నారు. బడుగు బలహీనవర్గాలతో పాటు మైనార్టీలకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉండి వారి అభివృద్ధికి కృషి చేస్తుందన్నారు. పొన్నం ప్రకాష్‌గౌడ్ ఆధ్వర్యంలో లీగల్, హ్యూమన్‌రైట్స్, ఆర్‌టీఐ డిపార్టుమెంటు మరింత పటిష్టమవుతుందని ఆయన అన్నారు.

కేటీఆర్‌ను కలిసిన కోటి శైలేష్ కురుమ



అబిడ్స్: మాజీ మంత్రి, రాష్ట్ర బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు కోటి శైలేష్ కురుమ గురువారం కలిశారు. గోషామహల్ నియోజకవర్గంతో పాటు హైదరాబాద్ పార్లమెంట్‌లో బీఆర్ఎస్ గెలిచే విధంగా కేటీఆర్ పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కోటి శైలేష్ కురుమ మాట్లాడుతూ..హైదరాబాద్, సికింద్రాబాద్ పార్లమెంటు నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ పటిష్టంగా ఉందన్నారు. గత పదేళ్లపాటు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రభుత్వం చేపట్టిన ప్రగతి, సంక్షేమం, అభివృద్ధితోనే ఈ ఎన్నికల్లో విజయం సాధిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకుడు ఆశీష్‌కుమార్ యాదవ్ పాల్గొన్నారు.

వాసు గ్రూప్ ఆధ్వర్యంలో పూజలు


పూజలు నిర్వహిస్తున్న బెజ్గామ్ శ్రీనివాస్, బెజ్గామ్ రమేష్ తదితరులు

అబిడ్స్: వాసు గ్రూప్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. శ్రీరామ నవమి వేడుకలను పురస్కరించుకుని వాసు గ్రూప్ నిర్వాహకులు బెజ్గామ్ శ్రీనివాస్ (శ్రీను), బెజ్గామ్ రమేష్ (రాము)లు పూజలు చేశారు. ఈ సందర్భంగా ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ పూజా కార్యక్రమంలో అరవింద్, అభినయ్, అక్షయ్, అనీష్ తదితరులు పాల్గొన్నారు.

భూదాన్ భూముల మాఫియాపై ఉక్కుపాదం మోపండి


మాట్లాడుతున్న చంద్ర మహాపాత్రో

గన్‌ఫౌండ్రీ: భూదాన్ భూముల మాఫియాపై తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఉక్కుపాదం మోపాలని అఖిల భారత సర్వ సేవా సంఘ్ ప్రధాన కార్యదర్శి గోరంక చంద్ర మహాపాత్రో విజ్ఞప్తి చేశారు. గురువారం గాంధీభవన్‌లో ఉన్న సర్వోదయ మండలి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడతూ..గత భూదాన్ యజ్ఞ బోర్డు చైర్మన్ ఫోర్జరీ సంతకాతో భూములను కాజేశారని ఆరోపించారు. తెలంగాణ రాష్ట్రంలో అన్యాక్రాంతమైన భూదాన్ భూములను తిరిగి స్వాధీనం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం 74వ భూదాన్ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశంలో మాజీ పార్లమెంటు సభ్యులు సయ్యద్ అజీజ్ పాషా, సర్వోదయ మండలి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఆర్.శంకర్‌నాయక్, అఖిలభారత సర్వ సేవా సంఘ్ మేనేజింగ్ ట్రస్టీ షేక్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.